'పది' పరీక్షా కేంద్రాల పరిశీలన

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల, మార్చి 23: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం నాలుగో రోజు గణితం పరీక్ష జరిగింది. 64 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 11,396 విద్యార్థులకు గానూ 11,376 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల హాజరు శాతం 99.82గా నమోదైంది. కాగా, సప్లిమెంటరీ విద్యార్థులకు సంబంధించిన మూడు పరీక్షా కేంద్రాల్లో 651 విద్యార్థులకు గానూ 623 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి హాజరు శాతం 95.70గా నమోదైంది. కలెక్టర్ యాస్మిన్ బాషా రెండు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

వెల్గటూర్, మార్చి 23: వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాల, ఎండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకురాలు ఎగ్గడి ఉషారాణి ఆకస్మిక తనిఖీ చేశారు.

నాలుగో రోజు గిరి ప్రదక్షిణ

ఉత్సవమూర్తులతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెల్గటూర్, మార్చి 23: కిషన్‌రావుపేట లోని నాగపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి గరుడ వాహనంపై గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు విష్ణువర్ధనాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, భక్తులు పాల్గొన్నారు.

టీఎన్జీవో నాయకుడికి సన్మానం

చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల, మార్చి 23: టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్‌ను జగిత్యాల టీజీవో నాయకులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల చంద్రశేఖర్ వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి ఇటీవల బదిలీపై వచ్చాడు. జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో శనివారం జిల్లా కార్యదర్శి మామిడి రమేశ్, జిల్లా ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రసాద్, శ్రీనివాస్, మల్లయ్య, నగేశ్, జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్, యూనియన్ నాయకులు చంద్రశేఖర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు.

రాజన్న ఆలయ కమిటీ సమావేశం

పెగడపల్లి, మార్చి 23: మండలకేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ కార్యవర్గ సమావేశం శనివారం ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వొరుగల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ, గాలి గోపురం పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం ఆలయ కమిటీ, దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించి ఆదాయ, వ్యయాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. సమావేశంలో మాజీ సర్పంచులు శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, గౌరవాధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి రాంచంద్రం, కమిటీ సభ్యులు కిషన్‌రావు, వెంకట్రావు, అశోక్‌రెడ్డి, కొమురెల్లి, గోపీకృష్ణ, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేశం, ప్రశాంత్, సుధాకర్, సాయి, ఎల్లయ్య, ప్రవీణ్‌రావు, ఆలయ పూజారి శ్రీనివాస్‌శర్మ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

ప్లాట్లు అమ్మబడును

★KNR TO HYD తిమ్మాపూర్ స్టేజి దగ్గర 220 గజాల ప్లాట్ మరియు ఇంద్రానగర్ హైవే7 దాబా దగ్గర 181 గజాల ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ సెల్ : 95500030002.
NTK-00000

WANTED

jobs Apply Now!

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958-All

SERVICES

★మీరు కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మేము మీకు న్యాయ సలహాలు ఇస్తాము. GLS, L.B.Nagar, Hyd. 7893011777.
NT-311873-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

సుతారి శ్రీనివాస్

కోరుట్ల, మార్చి 23: పట్టణ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సుతారి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు శనివారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా తోట ఆంజనేయులు, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా మద్దుల రోజ, కోశాధికారిగా చిలివేరి రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కాగా, ఈనెల 28న నిర్వహించే బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవి బరిలో తన్నీరు శ్రీనివాస్ రావు, బైరి విజయ్‌కుమార్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవి కోసం సయ్యద్ అనాసొద్దీన్, ఎండీ రఫీయొద్దీన్, మరిపల్లి గంగాధర్, సుతారి నవీన్, చింతకింది ప్రేమ్‌కుమార్, పూరడి నరేందర్ పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు మచ్చ వెంకటరమణామూర్తి, చెన్న విశ్వనాథం, వొటారికారి శ్రీనివాస్, సంగ విజయ్‌సాయి తెలిపారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

రాయికల్, మార్చి 23: రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పనితీరు గురించి, ఓటు హక్కును వినియోగించే పద్ధతిని వివరించారు. ఓటుహక్కుతో మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని సూచించారు. అనంతరం విద్యార్థులు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యం, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ షాప్ దగ్ధం

జగిత్యాల రూరల్, మార్చి 23: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ శివారులోని శ్రీరామ ఎలక్ట్రికల్ శానిటరీ షాప్ శనివారం దగ్ధమైంది. అజయ్‌కు చెందిన ఎలక్ట్రికల్ శానిటరీ షాప్‌లో మధ్యాహ్నం మూసి ఉన్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో షాపులోని వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది.

మూఢనమ్మకాలపై అవగాహన

సారంగాపూర్, మార్చి 23: బీర్‌పూర్ మండలం చర్లపల్లిలో శనివారం రాత్రి పోలీస్ కళా బృందం మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గౌతమ్ పవార్ మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా మోసపోతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాట చేసుకోవాలన్నారు.

విప్ ధిక్కరించినా వేటు వేయరా..?

- ఫిరాయింపుల చట్టానికి తూట్లు
- తొమ్మిది మంది కౌన్సిలర్లపై నెల కింద ఫిర్యాదు
- ఆరుగురికి షోకాజ్ నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గుతున్నారని విమర్శలు

చట్టం ముందు అందరూ సమానులే.. చట్టానికి లోబడి అందరూ పనిచేయాల్సిందే. కానీ, కొందరికీ చుట్టమవుతున్నది. అధికార పార్టీకి యంత్రాంగం అంటకాగుతున్నది. జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక వ్యవహారమే అందుకు ఉదాహరణగా నిలుస్తున్నది. బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరించి తొమ్మిది మంది కౌన్సిలర్లు అధికార పార్టీ మద్దతుదారుకు ఓటేశారు. వీరిపై అనర్హత వేటేయాలని పార్టీ బాధ్యులు నెల కిందటే అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ, ఇందులో ఆరుగురికి షోకాజు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. అనర్హత వేటు వేయకుండా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని (10వ షెడ్యూల్) అపహాస్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జగిత్యాల మున్సిపల్ కార్యాలయం

జగిత్యాల, మార్చి 21, (నమస్తే తెలంగాణ): జగిత్యాల మున్సిపల్‌లో బీఆర్ఎస్‌కు పూర్తి ఆధిక్యం ఉన్నది. కానీ, అధికార పార్టీ కుట్ర పూరితంగా ఓడించడం ఆశ్చర్యపరిచింది. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. 48 వార్డులు ఉండగా, 30 వార్డుల్లో బీఆర్ఎస్ గెలుపొందింది. 7 స్థానాల్లో ఇండిపెండెంట్లు, మరో ఏడు స్థానాల్లో కాంగ్రెస్, మూడింట బీజేపీ అభ్యర్థులు, ఒక్క చోట ఎంఐఎం సభ్యుడు గెలుపొందారు. ఐదుగురు స్వతంత్రులు, ఎంఐఎం అభ్యర్థి సైతం బీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వడంతో పూర్తి మెజార్టీతో పార్టీ అభ్యర్థి బోగ శ్రావణి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. 2023 జనవరిలో నాటకీయ పరిణామాల నేపథ్యంలో బోగ శ్రావణి చైర్‌పర్సన్, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత మున్సిపల్ చట్టంలోని నిబంధనల ప్రకారం ఒక్క కౌన్సిలర్ స్థానం ఖాళీగా ఉన్నా చైర్‌పర్సన్ పదవి ఎన్నికకు అవకాశంలేదు. ఖాళీగా ఉన్న కౌన్సిలర్ స్థానాన్ని భర్తీ చేసి, చైర్‌పర్సన్ ఎన్నిక చేపట్టాల్సి ఉండడంతో ఇన్‌చార్జికే బాధ్యతలు అప్పగించారు. గత డిసెంబర్‌లో ఇన్‌చార్జి చైర్మన్ శ్రీనివాస్ సైతం తనను బాధ్యతల నుంచి తొలగించాలని కలెక్టర్‌కు విన్నవించారు. అదే సమయంలో ప్రభుత్వం మున్సిపల్ చట్టానికి సవరణ చేస్తూ, కౌన్సిల్‌లో పది శాతంలోపు ఖాళీలు ఉన్నప్పుడు చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేందుకు అవకాశం కల్పించింది. దీంతో జగిత్యాల చైర్‌పర్సన్ ఎన్నికకు మార్గం సుగమమైంది. ఫిబ్రవరి 28న ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేశారు.

బీఆర్ఎస్ విప్ జారీ

బల్దియాలో బీఆర్ఎస్‌కు పూర్తి మెజార్టీ ఉన్నది. ఆ పార్టీ అభ్యర్థే గెలుపొందడం లాంఛనమే. అయితే, కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, స్వతంత్ర అభ్యర్థులు క్యాంపునకు వెళ్లారు. కాగా, పార్టీ ఆదేశానుసారం చైర్‌పర్సన్ అభ్యర్థిగా సమిండ్ల వాణిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రకటించారు. అయితే, కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు వ్యతిరేకించారు. తమకు చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకే వాణి అభ్యర్థిత్వాన్ని సమర్థించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అందుకు సభ్యులందరూ సమ్మతించారు. కానీ, కాంగ్రెస్, బీజేపీతో పాటు స్వతంత్ర కౌన్సిలర్లతో చేతులు కలిపారు. ఫిబ్రవరి 28న బల్దియా అధ్యక్ష స్థానానికి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికకు ముందు బీఆర్ఎస్ 29మంది కౌన్సిలర్లకు విప్ జారీ చేసింది. విప్ జారీ బాధ్యతను మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు పార్టీ అప్పగించింది. ఆయన రిటర్నింగ్ అధికారి, జడ్పీ సీఈవోకు విప్ జారీ చేసిన వారి జాబితాను అందజేశారు. 29 మందికి విప్ అందజేయాల్సి ఉండగా, కౌన్సిలర్ నారాయణరెడ్డి విదేశాల్లో ఉండడంతో వాట్సాప్ ద్వారా పంపించారు. కౌన్సిలర్లు అడువాల జ్యోతి, చదువుల తిరుపతమ్మ, సిరికొండ పద్మ విప్‌ను స్వీకరించలేదు. వీరికి కూడా వాట్సాప్ ద్వారా అందజేశారు. మిగిలిన 25 మంది కౌన్సిలర్లు విప్ పత్రాన్ని నేరుగా స్వీకరించారు.

9 మంది వ్యతిరేక ఓటు

ఫిబ్రవరి 28న రిటర్నింగ్ అధికారి, జడ్పీ సీఈవో గౌతంరెడ్డి బల్దియా అధ్యక్ష ఎన్నికను చేపట్టారు. నామినేషన్లను ఆహ్వానించగా బీఆర్ఎస్ నుంచి సమిండ్ల వాణి నామినేషన్ దాఖలు చేశారు. అదే బీఆర్ఎస్ అభ్యర్థిగా పేర్కొంటూ అడువాల జ్యోతి నామినేషన్ వేశారు. అయితే, జ్యోతి నామినేషన్‌కు బీఆర్ఎస్ బీఫాం అందజేయకపోవడంతో ఆమెను స్వతంత్ర అభ్యర్థిగా ప్రకటించారు. ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగానే రిటర్నింగ్ అధికారి బీఆర్ఎస్ విప్ జారీ చేసిందని, విప్‌నకు వ్యతిరేకంగా ఓటింగ్ చేస్తే ఓటు వ్యాలీడ్ అయినా, కౌన్సిలర్ సభ్యత్వం రద్దు అవుతుందని స్పష్టంగా ప్రకటించారు. తదుపరి ఎన్నికను చేపట్టగా, బీఆర్ఎస్‌కు చెందిన 9మంది సభ్యులు క్రాస్ ఓటింగ్ చేశారు. దీంతో బీఆర్ఎస్ బలపర్చిన సమిండ్ల వాణి ఓటమి పాలు కాగా, కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల అండతో జ్యోతి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

సభ్యత్వం రద్దు చేయాలంటూ ఫిర్యాదు

బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరించిన 9 మంది కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని, వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఫిబ్రవరి 29న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా కేవియట్‌ను సైతం దాఖలు చేశారు. అయితే, అధికారులు విప్‌ను ధిక్కరించిన కౌన్సిలర్లు బండారి రజని, చుక్క నవీన్‌కుమార్, దాసరి లావణ్య, అడువాల జ్యోతి, షబ్నమ్ తరున్నం, అల్లె గంగాసాగర్, సిరికొండ పద్మ, చదువుల తిరుపతమ్మ, సిరికొండ భారతిపై ఫిర్యాదు చేశారు. ఇందులో ఆరుగురికి రిటర్నింగ్ అధికారి నోటీసులు జారీ చేశారు. అడువాల జ్యోతి, చదువుల తిరుపతమ్మ, సిరికొండ పద్మ ముగ్గురు విప్‌ను నేరుగా స్వీకరించలేదని, వారికి వాట్సాప్‌లో పంపించారనే నెపంతో వారికి నోటీసులు ఇవ్వలేదు. మిగిలిన ఆరుగురికి విప్‌ను ఎందుకు ధిక్కరించారో తెలియజేయాలని, ఏడురోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. అయితే, ఫిర్యాదు చేసి మూడు వారాలు గడిచినా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పలుమార్లు బీఆర్ఎస్ నేతలు అధికారులను కలిసి అడిగినా స్పందించడంలేదు. నిబంధనల ప్రకారం ఫిర్యాదు అందిన తర్వాత విప్ పత్రాలను పరిశీలించి, వారం గడువుతో మొదటి నోటీసు, తదుపరి మరికొంత గడువుతో మరో నోటీసు జారీ చేసి, ధిక్కరించిన వారిపై పది, పదిహేను రోజుల వ్యవధిలో డిస్‌క్వాలీఫై చేసేందుకు అవకాశం ఉన్నది. కానీ, అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. దీనికి తోడు చైర్‌పర్సన్‌గా ఎన్నికైన జ్యోతితోపాటు, కొందరు స్వతంత్ర కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు కౌన్సిలర్ల డిస్‌క్వాలిఫై వ్యవహారాన్ని అడ్డుకుంటున్నట్లుగా తెలుస్తోంది. స్థానికంగా ఉన్న కీలక నేతతో పాటు, ప్రభుత్వంలో పెద్ద పదవిలో ఉన్న ఓ ప్రజాప్రతినిధి సైతం చర్యలు తీసుకోకుండా చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. రిటర్నింగ్ అధికారి జడ్పీ సీఈవో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు తెలుస్తున్నది.

నోటీసులు జారీ చేశాం

బీఆర్ఎస్ విప్ ధిక్కరించిన 9 మందిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందింది. అయితే, విప్ పత్రాలను ముగ్గురికి నేరుగా అందించలేదు. వారు విప్‌ను రిసీవ్ చేసుకున్నట్లు సంతకాలు లేవు. ఈ పరిస్థితుల్లో ఆరుగురికే నోటీసులు ఇచ్చాం. సమాధానం కోసం ఏడు రోజుల గడువు ఇచ్చాం. అయితే, అనారోగ్య కారణాల వల్ల నేను నెలరోజులు సెలవుపై వెళ్లిన. నోటీసులు ఇచ్చి సైతం పది రోజులు గడుస్తుంది. వివరణలు సైతం వచ్చి ఉంటాయి. విధుల్లో చేరిన వెంటనే వివరణలను పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటాం.

- గౌతమ్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారి (జడ్పీ సీఈవో)

వైభవంగా వెంకన్న గరుడ సేవ

ధర్మపురి లక్ష్మీనరసింహ ఆలయంలో క్యూలో భక్తులు

ధర్మపురి, మార్చి 23: ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనరసింహ(ఉగ్ర,యోగ), వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. 'కోనేట్లో స్నానాలయ్యో నారసయ్య..కొబ్బరి బెల్లాలివిగో నారసయ్య' అంటూ జానపద గేయాలు పాడుతూ భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండడంతో ధర్మపురి క్షేత్రం భక్తజన సందోహంగా మారింది. నాల్గోరోజైన శనివారం ఉదయం యజ్ఞాచార్యులు పురుషోత్తమాచార్యులు, నంబి శ్రీనివాసాచార్యులు, వేదపండితుడు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి, తలనీలాలు సమర్పించి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కాగా, వేంకటేశ్వరస్వామి ఊరేగింపుసేవ నిర్వహించారు. అందంగా అలంకరించిన గరుడవాహనంపై ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాల మధ్య దేవస్థానం పుర వీధుల గుండా ఊరేగించారు. పట్టణంలోని పాత టీటీడీ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఐదు వేల మంది భక్తులు వినియోగించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లు చేయగా, సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థానం సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు రవీందర్, మల్లేశం, సత్యనారాయణ, మొగిలి, పురుషోత్తం, మహేందర్, సాయికిరణ్, గణేశ్, శ్రీకాంత్, మల్లేశ్, సుజాత, పవన్‌కుమార్, శ్రీధర్, పండితులు, అర్చకులు తదితరులున్నారు.

కామాంధుడికి 20 ఏండ్ల జైలు

- ముగ్గురు బాలికలపై లైంగిక దాడి.. వేధింపుల కేసులో జగిత్యాల జడ్జి తీర్పు
- బాధితులకు తలా రూ.3లక్షల పరిహారం ఇవ్వాలని వెల్లడి

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 23: అభం శుభం తెలియని బాలికలపై లైంగికదాడికి పాల్పడ్డ ఓ కామాంధుడికి 20 ఏండ్ల జైలు శిక్ష పడింది. ముగ్గురు బాలికలపై అఘాయిత్యానికి పాల్పడడం, వేధింపుల కేసులో శనివారం జగిత్యాల జిల్లా జడ్జి నీలిమ తీర్పునివ్వగా, బాధిత కుటుంబాల్లో హర్షం వ్యక్తమైంది. సీఎంఎస్ ఎస్ఐ రాజానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన కొడిమ్యాల హరికృష్ణ అలియాస్ హరీశ్ గ్రామంలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తుంటాడు. నిత్యావసర సరుకుల కోసం దుకాణానికి ఒంటరిగా వచ్చే బాలికలను టార్గెట్ చేశాడు. ఈ క్రమంలో బాలికలకు తన సెల్ ఫోన్ ఇచ్చి గేమ్స్ ఆడుకోమని చెప్పేవాడు. మెళ్లగా వారిదగ్గరికి వెళ్లి సెల్‌ఫోన్‌లో బూతు వీడియోలు, బొమ్మలను వారికి చూపించేవాడు. ఈ క్రమంలో పలువురు బాలికలను బైక్‌పై ఎక్కించుకొని బహిరంగ ప్రదేశాలకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని ఇంట్లో చెబితే మీ ఇండ్లకు పోలీసులు వస్తారని, మీ పరువు పోతుందని చెప్పి భయపెట్టేవాడు. ఇలా గ్రామంలోని ముగ్గురు బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హరికృష్ణ చేస్తున్న వికృత చర్యలను గమనించి బాలికల తల్లిదండ్రులకు చెప్పాడు. ఈ క్రమంలో బాలికలను వారి తల్లితండ్రులు ఆరా తీయడంతో హరికృష్ణ చేసిన దురాగతాలను పూసగుచ్చినట్లు వివరించారు. దీంతో బాలికల తల్లిదండ్రులు 2022 ఏప్రిల్ 7న ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి ఠాణాలో అప్పటి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేయగా, ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్, జగిత్యాల డీఎస్పీ ఆర్. ప్రకాశ్ కేసు విచారించారు. పోలీసులు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టడంతో పీపీ బాల త్రిపుర సుందరి కేసు వాదించి నేరాన్ని రుజువు చేయడంతో ముగ్గురు బాలికలపై లైంగిక దాడి, వేధింపులకు పాల్పడ్డ హరికృష్ణ అలియాస్ హరీశ్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. అలాగే బాధిత బాలికల తల్లిదండ్రులకు ఒక్కొక్కరికీ రూ.3లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయమూర్తి నీలిమ శనివారం తీర్పునిచ్చారు.

నిందితుడిపై పీడీ యాక్ట్..

బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డ హరికృష్ణపై గొల్లపల్లి ఠాణాలో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అలాగే పీడీ యాక్ట్ అమలు చేశారు. అయితే అతి తక్కువ టైంలోనే నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష పడడంతో బాధిత కుటుంబాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సుంకె' పరామర్శ

కొడిమ్యాల, మార్చి 23: అప్పారావుపేటకు చెందిన మాజీ ఉప సర్పంచ్ మ ల్లారెడ్డి తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెంద గా, కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు పునుగోటి కృష్ణారావు, గరిగంటి మల్లేశం, నాయకులు అంకం రాజేశం, మొగిలిపాలెం రమేశ్ తదితరులున్నారు.

దేశ రాజకీయాలపై అవగాహన ఉండాలి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

కొడిమ్యాల, మార్చి 23: చదువుతో పాటు దేశ రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షీప్రసాద్ విద్యార్థులకు సూచించారు. నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జగిత్యాల నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కామాక్షీప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. చట్టాలు రూపొందించే పార్లమెంట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈసీఈ ప్రొఫెసర్ తిరుపతమ్మ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి వెంకటరాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌కుమార్, రవీందర్, సురేశ్, తదితరులున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు

చికెన్ ముక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ శానిటరీ సిబ్బంది

మెట్‌పల్లి, మార్చి 23: ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలను పాటించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలో శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఫాస్ట్ ఫుడ్, పానీపూరి సెంటర్లను తనిఖీ చేశారు. 120 మైక్రాన్ల తక్కువ బరువు కలిగిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ. 4 వేల జరిమానా విధించారు. ఇక్కడ పర్యావరణ ఇంజినీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, పున్నం నాయక్, నిజామొద్దీన్, నరేశ్, శేఖర్, తదితరులున్నారు.

వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలి

కోరుట్ల రూరల్, మార్చి 23: వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండి, రైతులు వేసిన పంటలకు సలహాలు, సూచనలందించాలని జిల్లా